క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చిర్రావూరు కృష్ణానది తీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తాడేపల్లి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం నిషేధిత చిర్రావూరు ఇసుక రీచ్ నుంచి ఎటువంటి వే బిల్లులు లేకుండా రెండు ఇసుక ట్రాక్టర్లు వస్తున్నాయని సమాచారం రావడంతో కనక దుర్గ వారధి రేపల్లె కరకట్టపై చిర్రావూరు వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను తనిఖీచేసి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో ట్రాక్టర్‌పై, డ్రైవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)పై టీడీపీ, జనసేన నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఎన్నడూ లేని విధంగా మంగళగిరి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ఆర్కే అభివృద్ధి చేశారన్నారు. మంగళగిరిలో గౌతమ బుద్ధ రోడ్డు, ఇప్పటం గ్రామంలో రోడ్డు నిర్మాణానికి విపక్షాలు దుర్బుద్ధితో ఎన్ని ఆటంకాలు కల్గించినా ఆర్కే పూర్తి చేశారన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో ఏం అభివృద్ధి పనులు చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రజలు 2019లో ఇచ్చిన తీర్పు మరోసారి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపైనున్న కార్మెల్ మాతను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్దఎత్తున తరలివచ్చారు. ఆదోని, కంభం, మార్కాపురం, ధర్మవరం ప్రాంతాల నుంచి పలు వాహనాల్లో భక్తులు తరలివచ్చారు. కొండ దిగువన ఉన్న బాల ఏసు దేవాలయంలో దివ్యపూజాబలిలో పాల్గొని కొండను ఎక్కారు. తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

దిశ చట్టంపై అవగాహన

మంగళగిరి: మంగళగిరి శాఖా గ్రంథాలయం, నూతక్కి శాఖా గ్రంథాలయాలలో ఆదివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలకు దిశ చట్టం, మహిళా సాధికారితపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీసులు హాజరై దిశ చట్టం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు రచనా పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా నవీన్, ఎస్‌కె ఫిరోజ్, ఎ.శంకరరావు, యు.రాజేశ్వరిలు వ్యవహరించగా గ్రంథాలయ సిబ్బంది ఎన్ ఆరోగ్యం, పి కృష్ణ, ఎస్కే అబ్దుల్ కపూర్, వై నరసింహారావు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

మంగళగిరి: ఏపీ స్టేట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటి నేతృత్వంలో జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యాన మంగళగిరి కోర్టు ఆవరణలో డిసెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, ఎంఎల్ఎస్ఏ చైర్మన్ వై నాగరాజ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులతోపాటు పెండింగ్‌లో ఉన్న కేసులు కక్షిదారులు రాజీ చేసుకోవచ్చని కోరారు. లోక్ అదాలత్ ద్వారా సమయం డబ్బు ఆదా అవుతాయని, లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

నృసింహస్వామి వస్త్రాల ఆదాయం రూ.80,750

మంగళగిరి: స్థానిక లక్ష్మీనృసింహస్వామి వారికి భక్తులు సమర్పించిన వస్త్రాలకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.80,750 సమకూరినట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారికి, అమ్మ వారికి భక్తులు సమర్పించిన కాటన్, ఫ్యాన్సీ చీరెలు 175, పంచెలు 28కి వేలం నిర్వహించినట్లు తెలిపారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైనులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.17,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి రాచబాటలు



విస్తరణ పూర్తి చేసుకున్న నగర ప్రధాన రహదారి గౌతమబుద్ధా రోడ్డు



నగర పరిధిలోని ఇప్పటం పొలల్లోకి వేసిన గ్రావెల్ రోడ్డు



నగరంలోని శివారు కాలనీలలో వేసిన గ్రావెల్ రోడ్డు

- రూ.315 కోట్లతో 383 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం
- నియోజకవర్గ వ్యాప్తంగా డొంక రోడ్ల అభివృద్ధి
- టీడీపీ, జనసేన పార్టీల తీరుపై ప్రజల ఆగ్రహం



ఇప్పటం రోడ్డు

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక నాలుగున్నర సంవత్సరాలలో రహదారులను అభివృద్ధి పరచి ఆదర్శంగా తీర్చిదిద్దారు. రహదారులు సరిగా లేక రైతులు పడుతున్న కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) వాటిని అభివృద్ధి పర్చారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మంగళగిరి పట్టణ ప్రజలకు గౌతమ బుద్ధా రోడ్డు నిర్మాణంతో విముక్తి కల్పించారు. నియోజకవర్గంలో నాలుగున్నర సంవత్సరాలలో రూ.315 కోట్లతో 343 కిలోమీటర్లు రోడ్లను విస్తరించారు. నగరంలో రూ.273 కోట్లతో 297 కిలోమీటర్ల మేర 411 రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటివరకు రూ.240 కోట్లతో చేపట్టిన 342 నిర్మాణాలు పూర్తికాగా మరో రూ.33 కోట్లతో చేపట్టిన 69 రోడ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. దుగ్గిరాల మండలంలో రూ.41 కోట్లతో చేపట్టిన 46 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. రూ.103.84 కోట్లతో శివారు కాలనీలలో చేపట్టిన 93.92 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తికాగా, ఆర్ఎండీబీ ఆధ్వర్యంలో రూ.52 కోట్లతో చేపట్టిన 63 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నగరంలో చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణాలు 137.30 కిలోమీటర్ల రోడ్లలో 33 సీసీ రోడ్లు, 30 బీటీ రోడ్ల నిర్మాణాలు రూ.83 కోట్లతో పూర్తి చేశారు. విలీన గ్రామాలలోని పంట పొలాల్లో డొంక రోడ్లతోపాటు నగర శివారు కాలనీలలో రూ.40 కోట్లు వెచ్చించి 120 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.

అభివృద్ధికి టీడీపీ, జనసేన అడ్డంకులు

నియోజకవర్గంలో అభివృద్ధికి టీడీపీ, జనసేన పార్టీలు అడ్డంకిగా మారాయి. మంగళగిరి పట్టణ ప్రధాన రహదారి గౌతమబుద్ధా రోడ్డు, ఇప్పటం రోడ్లతోపాటు పలు రహదారుల విస్తరణకు ఆ పార్టీలు అడ్డుపడ్డాయి. స్థానికులను రెచ్చగొట్టడంతోపాటు కోర్టులకు ఎక్కి రోడ్ల నిర్మాణాలను ఆపాలని ఎన్ని కుయుక్తులు పన్నినా ఎక్కడా రాజీపడకుండా రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఇది సహించలేని ఆ పార్టీల నాయకులు ఎమ్మెల్యే ఆర్కేపై విమర్శలు చేయడం ప్రారంభించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం మానుకుని సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల విస్తరణ ప్రధానం



నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతుల కల్పనతోపాటు రోడ్ల విస్తరణ ప్రధానం. నగర పాలక సంస్థగా అవతరించిన అనంతరం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజల అవసరాలకి అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపడుతున్నాం. గౌతమబుద్ధా రోడ్డు విస్తరణతో మంగళగిరి రూపురేఖలు మారాయి. తెనాలి రోడ్డుతో మరికొన్ని రోడ్లు విస్తరణ చేసి అభివృద్ధి పరిస్తే నగరం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది. స్థానికులు సహకరించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

పట్టణ రూపురేఖలు మారాయి



మంగళగిరి ప్రధాన రహదారి గౌతమబుద్ధా రోడ్డు విస్తరణ చేస్తామని ఎంతో మంది నాయకులు ఎన్నోసార్లు చెప్పారు. ఒక్కరూ నెరవేర్చలేదు. ఎమ్మెల్యే ఆర్కే గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ చేస్తామంటే ఎప్పటికి కావాలి అని ఎంతో మంది వ్యాఖ్యానించారు. కానీ రోడ్డు విస్తరణ చేయడం విశేషం. రోడ్ల విస్తరణతోనే నగరం అభివృద్ధి చెందుతుంది. గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ మంగళగిరి రూపురేఖలు మారాయి. మిగిలిన రోడ్ల విస్తరణకు స్థానికులు సహకరించాలి.

– మొండి సత్యనారాయణ, మంగళగిరి

కుట్రలు ఫలించలేదు...



ఇప్పటంలో రోడ్డు విస్తరణను అడ్డుకునేందుకు జనసేన, టీడీపీ చేసిన కుట్రలు ఫలించలేదు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ నాయకుడు లోకేష్‌లు పర్యటించి స్థానికులను రెచ్చగొట్టి కోర్టులకు వెళ్లినా ఎమ్మెల్యే ఆర్కే మొక్కవోని పట్టుదలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయం. రోడ్డు పూర్తికావడంతో నాడు అడ్డుకున్న వారే నేడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరం అభివృద్ధి చెందాలంటే రోడ్ల విస్తరణ ఎంతో అవసరమని తెలుసుకోవడం సంతోషం.

– శంకరశెట్టి రమేష్, ఇప్పటం

లింకు రోడ్లు అభివృద్ధి



శివారు కాలనీలు, పొలాల్లో లింకు రోడ్లు, డొంక రోడ్లు అభివృద్ధి పరచడం అభినందనీయం. నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు ఇంత అభివృద్ధి ఎన్నడూ జరగలేదు. రోడ్ల అభివృద్ధిపై టీడీపీ, జనసేన నాయకులు నిరసనకు దిగడం విడ్డూరం. టీడీపీ పాలనలో నగరంలో ఒక్క రోడ్డు నిర్మాణం జరగలేదు.

– వాసు, యర్రబాలెం

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

23న రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం



నెహ్రూనగర్: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని నవంబర్ 26న భారత పార్లమెంటు ఆమోదించిన సందర్భంగా ఈనెల 23న ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక కమిటీ నాయకులు, ఐడియా ఇద్యా సంఘాల నాయకులు తెలిపారు. సదస్సులో ప్రధానవక్తలుగా శాసనమండలి సభ్యులు, జిల్లా అధికారులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యలపై పలు తీర్మానాలను ప్రవేశపెట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామని చెప్పా రు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరు వాత మొదటిసారిగా రాష్ట్రంలో కుల గణన నవంబర్ 26 నుంచి ప్రారంభం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కుల గణన అనంతరం, దామాషా ప్రాతిపదికన రాజ్యాంగ ఫలాల్ని సా ధించేందుకు జరగాల్సిన కృషిపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీ ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులంతా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. మద్దు ప్రేమజ్యోతిబాబు, కందుల దినమనరాజు, డొక్కా జార్జ్, తిప్పాబత్తుని గోవిందు, మోపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది శ్రమదానం

గుంటూరుమెడికల్: జీజీహెచ్‌లోని కమర్షియల్ క్యాంటీన్‌లో ఆదివారం డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు, సిబ్బంది శ్రమదానం చేశారు. చీపురు పట్టి బూజు దులిపారు. పాత సామానులు, పనికిరాని వస్తువుల్ని తొలగించి శుభ్రం చేశారు. మూడు రోజుల్లో ఈ గదులన్నీ మెడికల్ విభాగానికి కేటాయించి 30 పడకల్ని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. శ్రమదానం చేసిన వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. పెద్ద మనస్సుతో గదుల్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన క్యాంటీన్ నిర్వాహకుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని, సమీనా బేగం, ఇంజినీరింగ్ అధికారులు రత్తయ్య, సత్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా, ఆలయ సభ్యులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లాలాపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం, స్వామి జన్మ నక్షత్రం శ్రవణం సందర్భంగా ఆదివారం అభిషేకం, తొమ్మిది రకాల పుష్పాలతో యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గా వరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జొన్నకూటి సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని. స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆర్.టి.ఆర్.వి. ప్రసాద్, గోపాలకృష్ణ పుష్పయాగంతో పాటు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఉడత మహేష్ కుమార్, దమ్ములపాటి విజయ నిర్మల, ఇస్లావత్ గాంధీ నాయక్, యంబడి రాంబాబు, సూరిబోయిన వెంకట్రావు, మైలవరపు సుజన, తరిమల్లె వనజ, జవ్వాజి లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంపాలెంలో...

స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై స్వామివారి శ్రవణ నక్షత్రం, కార్తిక మాసం సందర్భంగా ఆదివారం కొండబోలు శివప్రసాద్, ఉమా శంకర్ దంపతుల సౌజన్యంతో పుష్పయాగం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అర్చకులు స్వామికి వేద మంత్రాలతో విశేష పూజలు జరిపారు. భక్తులకు మహా హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి బృందం పూజలు నిర్వహించగా, పంచామృతాలు, వివిధ నదీ జలాలతో అభిషేకార్చన జరిపారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు.

ఈ శ్రమ కార్డులు ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

- ప్రతి ప్రాంతంలో ఈ శ్రమ కార్డులపై ప్రచారం నిర్వహించాలి
- ఉప కార్మిక కమిషనర్ ఎం.గాయత్రిదేవి



ఈ శ్రమ కార్డులు నమోదును పరిశీలిస్తున్న గుంటూరు కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రిదేవి

తాడేపల్లిరూరల్: ఈ శ్రమ కార్డును ప్రతి ఒక్కరూ తీసుకునే విధంగా అధికారులందరూ పనిచేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.గాయత్రిదేవి అన్నారు. తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలోని డాక్టర్ వైఎస్సార్ సమావేశ మందిరంలో ఈ శ్రమ కార్డు, పీఎంఎస్‌వైఎం పథకంపై కార్మిక శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గాయత్రిదేవి మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించే ఈశ్రమ కార్డులపై ప్రతి ఒక్క కార్మికుడికి అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ కార్డు పొందే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ఈ సేవ కేంద్రంలో నమోదు చేస్తారని, ఈ కార్డు నమోదు చేయించుకోవడం వల్ల కార్మికులకు ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే వారి కుటుంబానికి ఆర్థికపరంగా ఎంతో ఉపయుక్తమని అన్నారు. సమావేశంలో తెనాలి సహాయ కమిషనర్ డీవీ శివ ప్రసాద్, సహాయ కార్మిక అధికారి మూర్తి, మంగళగిరి సహాయ కమిషనర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులతో పాటిబండ్ల విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: భావితరాల భవిష్యత్తును నిర్మించే జాతి నిర్మాతలు ఉపాధ్యాయులని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య సంస్థలో ఇన్నర్ వీల్ క్లబ్, గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినులు మోహన వంశీ, నాగవల్లి సౌజన్య నేషనల్ బిల్డర్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేయడం వారిలో మరింతగా ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక వికాసానికి క్విజ్ పోటీలు దోహదం



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థుల మానసిక వికాసానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్-అమరావతి ప్రాంత్ ఆధ్వర్యంలో భారత్ కో జానో పేరుతో రాష్ట్ర స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీహెచ్.ఎ.పి. రామేశ్వరరావు మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసంతోపాటు పోటీ ప్రపంచంలో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌తో కూడుకున్న సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. క్విజ్ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. జూనియర్స్ విభాగంలో గుంటూరు కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు అఖిల, అన్నావైష్ణవి ప్రథమ స్థానం, విజయవాడలోని ఫ్యూచర్‌పాత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఏ.హర్షవర్ధన్, కె. కీర్తన, ద్వితీయ స్థానం, మచిలీపట్నంలోని నిర్మలా హైస్కూల్ విద్యార్థులు వి.కె.ఎన్. అయ్యప్ప, బి. కేతనాశ్య తృతీయ స్థానంలో నిలిచారు. సీనియర్స్ విభాగంలో మంగళగిరిలోని అరవిందా స్కూల్ విద్యార్థులు వై.సత్య సుబ్రహ్మణ్య, జి.ప్రమోద్, గుంటూరులోని కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఏ.శ్రీవత్స, ఏ.హర్షవర్ధన్, గుడివా డలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కె. మహిత, టీవీడీ మానస తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 26న వైజాగ్‌లో జరిగే రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం సమక్షంలో బహుమతులు అందజేశారు. ఎస్.వి.ఎస్ లక్ష్మీనారాయణ, సాదు శివశంకరరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



వివిధ దేశ నాయకులు వేషధారణలో విద్యార్థులు, అతిథులు



ముగ్గుల పోటీలలో విద్యార్థినులు వేసిన ముగ్గు

తాడికొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తాడికొండ శాఖ గ్రంథాలయం, తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళుర్పించిన అనంతరం పలువురు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తం అన్నారు. విద్యార్థులు ఆ దిశగా ఉన్నతంగా ఎదగాలని సూచించారు. నార్త్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నూతక్కి ప్రమీల ఆధ్వర్యంలో విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి శ్రీనివాస రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, మహిళా గ్రంథాలయాధికారి జి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు బహుమతులు అందజేసి మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గిరిధర్‌కుమార్ ఐసీడీఎస్ సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

తాడేపల్లిరూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి నాగుర్ బాషా మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాఠశాలల నుంచి పలువురు విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించామని, కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా ఆది లక్ష్మి వ్యవహరించారని తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో బాలల వారోత్సవాలు

లక్ష్మీపురం: రైల్వేస్టేషన్లలో ఒంటరిగా ప్రయాణించే బాలలు, దారి తప్పిన బాలలకు అవగాహన కల్పించి వారి సంరక్షణ కోసం రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ అందుబాటులో ఉంటాయని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ సమీర్, ఆర్పీఎఫ్ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం బాలల వారోత్సవాల్ని రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్లలో ఒంటరిగా సంచరిస్తున్న వారు, దారి తప్పిన బాలలు, తల్లిదండ్రులపై అలిగి వచ్చిన వారిని గుర్తించి టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం బాలల భద్రతపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ భాజన్, జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి, ఆర్పీఎఫ్ ఎస్ఐ వనిత, రైల్వే చైల్డ్‌లైన్ సూపర్ వైజర్లు, సంస్థ సభ్యులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.